సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే..

దేశంలో, రాష్ట్రంలో ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఆలయ పరిశీలన

మామిడిపల్లి శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని పరిశీలించేందుకు వచ్చిన అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. 8లో▸



కంటి సమస్యలను అరికట్టాలి

పిల్లల్లో కంటి సమస్యల నివారణకు విటమిన్‌–ఏ ఎంతగానో దోహదపడుతుందని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. 8లో▸

‘రియల్‌’ డీలా!



యాచారం మండలం తక్కళ్లపల్లిలో విక్రయాలు లేక మధ్యలో నిలిపేసిన ఓ డీటీసీపీ వెంచర్‌

ఆరు నెలలుగా స్తంభించిన భూముల క్రయవిక్రయాలు

- జిల్లాలో నిలిచిన ఆర్థిక లావాదేవీలు
- ఫార్మాసిటీపై భిన్న ప్రకటనలతో అయోమయం
- కొత్త సర్కార్‌పై వ్యాపారుల ఆశలు

యాచారం: రియల్‌ వ్యాపారం డీలా పడింది. ఆరు నెలలుగా భూ క్రయవిక్రయాలు స్తంభించిపోయాయి. జిల్లాలో రూ.వెయ్యి కోట్లకు పైగా భూలావాదేవీలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌ మహానగరం చుట్టూ జిల్లా విస్తరించి ఉంది. వ్యవసాయ భూములు, ఫాంహౌస్‌లు, విల్లాల కొనుగోలుకు బడా వ్యాపారులతో పాటు రాజకీయ పెద్దలు, ఉన్నతాధికారులు ఆసక్తి చూపారు. 2020 నుంచి జోరందుకున్న రియల్‌ వ్యాపారం ఆరు నెలలుగా ముందుకు సాగడం లేదు. ప్రముఖ రియల్‌ వ్యాపార సంస్థలు, రాజకీయ పెద్దలు రూ.కోట్లు ఖర్చు చేసి యాచారం, మంచాల, కందుకూరు, మాడ్గుల్‌, ఆమనగల్లు, కడ్తాల్‌, తలకొండపల్లి, షాద్‌నగర్‌ తదితర మండలాల్లో వందలాది ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేశారు. 2020–21లో కొనుగోలు చేసిన వ్యవసాయ భూముల విక్రయాలు జరగడంతో వ్యాపారులు మంచి లాభాలు గడించా. రూ.కోట్లలో ఆదాయం రావడంతో తిరిగి భూములపై పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ఆ భూములు విక్రయాలు కాకపోవడంతో వచ్చిన లాభాలు, తెచ్చిన అప్పులు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి.

ఫార్మాసిటీ పేరుతో..

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులోని యాచారం, కడ్తాల్‌, కందుకూరు మండలాల పరిధిలోని 10 గ్రామాల్లో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు గత ప్రభుత్వం నిర్ణయించింది తెలిసిందే. ఫార్మాసిటీ పక్కనే ఉన్న గ్రామాల్లో వ్యవసాయ భూముల ధరలు ఎకరాకు రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నరకు పైగా పలికాయి. నందివనపర్తిలో ఎకరాకు రూ.రెండు కోట్లకు పైనే ధర పలికింది. భవిష్యత్తులో ఈ గ్రామానికి మహర్దశ పట్టనుందనే ఆశతో ఎంతోమంది వందలాది ఎకరాల భూములను కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఇక్కడ కూడా వ్యాపారం తలకిందులైంది. రేవంత్‌రెడ్డి సర్కార్‌ మొదట్లో ఫార్మాసిటీని రద్దు చేస్తామని.. ఆ తర్వాత పక్షం రోజులకు ఫార్మాసిటీని తీసేది లేదని, ఫార్మా విలేజీలు నిర్మిస్తామని చేసిన వేర్వేరు ప్రకటనలతో అయోమయం నెలకొంది. ఫార్మాసిటీ పేరుతో రియల్‌ వ్యాపారం ఊపందుకునే తరుణంలో ఈ ప్రకటనలతో ఆయా గ్రామాల్లో వ్యాపారులు ఏర్పాటు చేసిన వెంచర్లలో కూడా ప్లాట్లు విక్రయం కావడం లేదు.

సీఎంపైనే ఆశలన్నీ..

జిల్లా పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రముఖ పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా కృషి చేసే అవకాశం లేకపోలేదని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. నాగార్జునసాగర్‌, శ్రీశైలం హైవేల్లో పేరొందిన పరిశ్రమలు, విద్యాసంస్థలను నెలకొల్పితే భూముల ధరలకు రెక్కలొచ్చి వ్యాపారం మళ్లీ పుంజుకుంటుందని వ్యాపారులు ఆశతో ఉన్నారు.

ప్రభుత్వంపై భరోసాతో ఉన్నాం



మహానగరం చుట్టూ విస్తరించి ఉన్న జిల్లాలో మళ్లీ రియల్‌ వ్యాపారం పుంజుకుంటుందన్న ఆశతో ఉన్నాం. ఈ ప్రాంతంతో సీఎంకు ఎంతో అనుబంధం ఉండడంతో ప్రముఖ పరిశ్రమలు, విద్యాలయాలు నెలకొల్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వంపై భరోసాతో ఉన్నాం.

– అక్కలి మధుకర్‌రెడ్డి, రియల్‌ వ్యాపారి, హైదరాబాద్‌



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఇందిర

మత్తుకు బానిసలు కావొద్దు

- సీనియర్‌ సివిల్‌ జడ్జి ఇందిర

షాద్‌నగర్‌: విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని షాద్‌నగర్‌ కోర్టు సీనియర్‌ సివిల్‌ జడ్జి ఇందిర సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ధీర సేవా సంస్థ, ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుపైనే దృష్టి సారించాలని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఒత్తిడిని దూరం చేసుకునేందుకు తప్పుడు దారులు వెతుక్కుంటే జీవితాలు నాశనం అవుతాయని హితవు పలికారు. సరదాగా అలవాటు చేసుకుంటే జీవితాంతం బాధపడాల్సి ఉంటుందన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు గురికావొద్దని సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ధీర సేవా సంస్థ చైర్మన్‌ నిశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కమల, అధ్యాపకులు భానుప్రకాష్‌, సామ రవీందర్‌రెడ్డి, ఉత్తర ఫాల్గుణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్‌ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్‌ లెవల్‌ పోలీసు రిక్రూట్‌మెంట్‌ బోర్డ్‌ (టీఎస్‌ఎల్‌పీఆర్బీ) ద్వారా వివిధ పోస్టులకు ఎంపికైన వారికి బుధవారం ఎల్బీ స్టేడియంలో అపాయింట్‌మెంట్‌ ఆర్డర్లు అందించనున్న నేపథ్యంలో స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్‌ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్‌ చీఫ్‌ విశ్వప్రసాద్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. ఏఆర్‌ పెట్రోల్‌ పంప్‌–బీజేఆర్‌ విగ్రహం–బషీర్‌బాగ్‌ మార్గాల్లోకి అనుమతించరు. చాపెల్‌ రోడ్‌, నాంపల్లి వైపు నుంచి బీజేఆర్‌ స్టాచ్యూ వైపు వచ్చే వాహనాలను ఏఆర్‌ పెట్రోల్‌ పంప్‌ నుంచి మళ్లిస్తారు. గన్‌ఫౌండ్రీ ఎస్బీఐ నుంచి బషీర్‌బాగ్‌ ఫ్లైఓవర్‌ వైపు వచ్చే వాహనాలను చాపెల్‌ రోడ్‌ మీదుగా, రవీంద్రభారతి, హిల్‌ఫోర్ట్‌ రోడ్‌ వైపు నుంచి బీజేఆర్‌ స్టాచ్యూ వైపు వచ్చే వాహనాలను సుజాత హైస్కూల్‌ మీదుగా, బషీర్‌బాగ్‌ ఫ్లైఓవర్‌ వైపు నుంచి వచ్చే వాహనాలను చాపెల్‌ రోడ్‌ మీదుగా మళ్లిస్తారు. బషీర్‌బాగ్‌ నుంచి కంట్రోల్‌ రూమ్‌ వైపు వచ్చే వాటిని లిబర్టీ మీదుగా పంపిస్తారు. సహాయ సహకారాలకు ట్రాఫిక్‌ హెల్ప్‌ లైన్‌ నంబర్‌ 9010203626లో సంప్రదించాలి.

న్యూస్‌రీల్‌

గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కడ్తాల్‌: గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌ ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో గిరిజన విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించనున్న అవగాహన సదస్సుకు సంబంధించి మండల కేంద్రంలో మంగళవారం వాల్‌పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హన్మానాయక్‌ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో లక్ష్యసాధన, సమయ పాలన, పరీక్షల్లో భయాన్ని ఏ విధంగా తొలగించాలి, ఏ విధంగా విజయం సాధించాలి, ఏకాగ్రత, జ్ఞాపక శక్తిని ఏ విధంగా పెంపొందించుకోవాలనే అంశాలపై నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సదస్సును గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీవీఎస్‌ మహబూబ్‌నగర్‌ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్‌, నాయకులు రాములునాయక్‌, రాందాస్‌ నాయక్‌, లక్ష్మణ్‌నాయక్‌, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ డీఏలు చెల్లించాలి



క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేశవులు, ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి డిమాండ్‌ చేశారు. నియోజకవర్గంలోని ఎంపీపటేల్‌గూడ, ఆదిబట్ల, పోచారం ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని.. జీవో 317తో స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను తమ సొంత ప్రాంతాలకు తీసుకురావాలని, సెకండరీ గ్రేడ్‌ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు శిక్ష

ఇబ్రహీంపట్నం: బాలికను వేధించిన కేసులో నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మంగళవారం ఎల్బీనగర్‌ ఫాస్ట్‌ ట్రాక్‌ ప్రత్యేక న్యాయమూర్తి సునీత తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్‌ గ్రామానికి చెందిన డి. శివకుమార్‌ ఓ బాలికను వేధింపులకు గురిచేయడంతో 2018లో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. కేసు పూర్వాపరాలను విచారించిన ఫాస్ట్‌ ట్రాక్‌ న్యాయమూర్తి నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.లక్ష పరిహారం అందజేశారు.

గ్యాస్‌ ఏజెన్సీల అక్రమాలపై ఫిర్యాదు



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తుర్కయంజాల్‌: జిల్లాలో గ్యాస్‌ ఏజెన్సీల అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయని వీటిని వెంటనే అరికట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మనోహర్‌ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ అధిక ధరలు వసూలు చేయడంతో పాటు, బ్లాక్‌ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ శశాంక

అర్హులందరికీ రుణాలివ్వండి

బ్యాంకర్లకు కలెక్టర్‌ శశాంక ఆదేశం

ఇబ్రహీంపట్నం రూరల్‌: అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ శశాంక జిల్లా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం 2023–24 సంవత్సరపు జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేదలందరికీ మంజూరు చేయాలని అన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. స్వయం సహాయ సంఘాల రుణాల పరిమితిని పెంచాలని తెలిపారు. బ్యాంకులు వార్షిక సంవత్సరం ముగిసేలోగా వారి లక్ష్యాలను అధిగమించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌, ఎల్‌డీఎం జి.కుసుమ, ఆర్‌బీఐ అధికారి ఏకే కల్పోరి, జీఎండీసీఐ రాజేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, గిరిజన శాఖ అధికారి రామేశ్వరిదేవి, పీడీ మెప్మా శంకర్‌సింగ్‌, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగండి

- పరీక్షలంటే భయం వీడండి
- విద్యతోనే అభివృద్ధి
- డీఈఓ సుశీందర్‌రావు



మానసిక నిపుణుడు డాక్టర్‌ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, డీఈఓ తదితరులు

షాద్‌నగర్‌రూరల్‌: విద్యార్థులు ప్రణాళికలను రూపొందించుకొని చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. పట్టణంలోని ఠాగూర్‌ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో మంగళవారం ఎంఈఓ శంకర్‌రాథోడ్‌ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక నిపుణుడు డాక్టర్‌ లక్ష్మణ్‌ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, భవిష్యత్‌లో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి లక్ష్యసాధనకోసం నిరంతరం శ్రమించాలని అన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. సమయాన్ని వృథాచేయకుండా చదువుపై ధ్యాస పెడితే మంచి ఉత్తీర్ణతను సాధిస్తారని పేర్కొన్నారు. మానసిక నిపుణుడు డాక్టర్‌ లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు కలలు కనడం మాత్రమే కాకుండా ఆ కలలను నిజం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఆలోచనలను ఆచరణలో పెట్టి సరైన నిర్ణయాలతో ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని అన్నారు. సరైన ఆలోచనలు, సరైన నిర్ణయాలు, సరైన పని, సరైన సాధన చేస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంఈఓలు కృష్ణారెడ్డి, మనోహర్‌, ఉపాధ్యాయులు గౌరీశంకర్‌, పాండురంగయ్య, హస్నొద్దీన్‌, ప్రకాష్‌, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

చేవెళ్ల: పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను మొదటిస్థానంలో నిలపాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్‌, మొయినాబాద్‌, శంకర్‌పల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకోసం ప్రత్యేక తరగతులు నిర్వహించటం జరుగుతుందని చెప్పారు. మానసిక నిపుణుడు లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టంతో చదవాలని పేర్కొన్నారు. భయపడకుండా ప్రశాంతంగా ఉండి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్‌, విషయ నిపుణులు అక్బర్‌,కల్పన, సోలోమాన్‌,నాగేశ్‌బాబు, మహిపాల్‌రెడ్డి, రియాజ్‌, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నార్కోటిక్స్‌ వింగ్‌.. నామ్‌కే వాస్తే

కేటాయించిన పోస్టులు సగం కూడా భర్తీ కాలేదు

- కార్యాలయాలు, వాహనాలకు దిక్కేలేదు
- ప్రోత్సాహకం మాటే పట్టని ప్రభుత్వ పెద్దలు
- గగ్గోలు పెడుతున్న అధికారులు, ఇతర సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: ‘రాష్ట్రంలో డ్రగ్స్‌ అనే మాటే వినిపించకూడదు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయి సహా అన్ని నిషేధిత ఉత్పత్తుల రవాణా, విక్రయం, వినియోగం ఉపేక్షించేది లేదు’. గత, ప్రస్తుత ప్రభుత్వ పెద్దల మాటలివి. వాస్తవ పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మంగా ఏర్పాటైన తెలంగాణ స్టేట్‌ యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో (టీఎస్‌ నాబ్‌) పరిస్థితే దీనికి ఉదాహరణ. ఇది ఆవిర్భవించి తొమ్మిది నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ తీవ్రమైన వనరుల కొరతతో కొట్టుమిట్టాడుతోంది.

సిబ్బంది కంటే అధికారులే అధికం..

పోలీసు శాఖలో ఏ విభాగాన్ని తీసుకున్నా ఉన్నతాధికారులు, అధికారుల సంఖ్య తక్కువగా, క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే కింది స్థాయి సిబ్బంది సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

కనిపించని మౌలిక వసతులు..

టీఎస్‌ నాబ్‌ను ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం పోయినేడాది ఏప్రిల్‌ 30న ఉత్తర్వులు జారీ చేయగా.. అదే ఏడాది మే 31న ఆవిష్కారమైంది. ప్రాథమికంగా ఈ విభాగానికి 300 పోస్టులు కేటాయించింది. హైదరాబాద్‌, సైబరాబాద్‌, రాచకొండలతో పాటు వరంగల్‌లో నార్కోటిక్స్‌ ఠాణాలు, వరంగల్‌, కరీంనగర్‌, నిజామాబాద్‌, సంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లతో పాటు సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌లోనూ రీజినల్‌ నార్కోటిక్స్‌ సెల్స్‌ ఏర్పాటు చేయాలి. పోలీసు స్టేషన్లకు డీఎస్పీ స్థాయి అధికారి స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉంటారు. బంజారాహిల్స్‌లోని కమాండ్‌ అండ్‌ కంట్రోల్‌ రూమ్‌లో ఇచ్చిన కార్యాలయం తప్ప... రాష్ట్రంలో మరెక్కడా చిన్న గది కూడా ఈ విభాగానికి కేటాయించలేదు. డైరెక్టర్‌ సహా ఇప్పటి వరకు ఈ వింగ్‌కు రిపోర్టు చేసిన వారి సంఖ్య కేవలం 68 మాత్రమే. ఉన్నతాధికారులు మినహా మరెవరూ సంచరించడానికి వాహనాలు సహా ఏ ఇతర సదుపాయం లేదు.



టీఎస్‌ నాబ్‌ ఆవిష్కరణ (ఫైల్‌)

ప్రోత్సాహకం మాటే మరిచారు..

ఏసీబీ, సీఐడీ, ఇంటెలిజెన్స్‌ విభాగాల మాదిరిగా టీఎస్‌ నాబ్‌కూ డైరెక్టు రిక్రూట్‌మెంట్‌ లేదు. ఇందులోని పోస్టుల్ని అపోర్షన్‌మెంట్‌గా పిలిచే డిప్యుటేషన్‌ విధానంలో భర్తీ చేస్తారు. ఆసక్తి ఉన్న వాళ్లు దరఖాస్తు చేసుకోవాలంటూ గతంలోనే పోలీసు విభాగం అంతర్గతంగా ప్రకటన ఇచ్చింది. దీంతో అనేక మంది ఆసక్తి చూపుతూ ముందుకు కూడా వచ్చారు. ఎస్సైలను రేంజ్‌ డీఐజీలు, ఇన్‌స్పెక్టర్లను జోన్‌ ఐజీలు, కానిస్టేబుళ్లను యూనిట్‌ ఆఫీసర్లు రిలీవ్‌ చేసి పంపాల్సి ఉంది. వీళ్లల్లో ఎవరూ స్పందించకపోవడంతో అనేక ఖాళీలతో టీఎస్‌ నాబ్‌ ఆపసోపాలు పడుతోంది. ఈ విభాగంలో పని చేసే వారికి ప్రత్యేక ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు గతంలో ఉన్నతాధికారులు చెప్పారు. సాధారణంగా రిస్కుతో కూడిన ఉద్యోగాలు చేసే వింగ్స్‌కు వేతనంపై 60 శాతం అదనంగా ఇస్తారు. ఇప్పటి వరకు చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో టీఎస్‌ నాబ్‌లో పని కూడా రిస్కుతో కూడిన వ్యవహారంగా తేలింది. అయినప్పటికీ ఈ ప్రోత్సాహకం విషయం ఇప్పుడు ఎవరూ పట్టించుకోవట్లేదు.

వీటి ఊసెత్తేవారే లేరు..

టీఎస్‌ నాబ్‌ రాష్ట్ర స్థాయిలో, ఇతర విభాగాలు, రాష్ట్రాలతో సమన్వయంతో పని చేయాల్సి ఉంది. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగం సహా అన్ని అంశాలపై ఈ బ్యూరో కన్నేసి ఉంచి సూత్రధారులకు చెక్‌ చెప్పాలి. దీని డైరెక్టర్‌ ఆధీనంలో ఠాణాలు, రీజినల్‌ నార్కోటిక్‌ కంట్రోల్‌ సెల్స్‌తో పాటు 26 నార్కోటిక్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ వింగ్స్‌ పని చేయాలి. ఇన్వెస్టిగేషన్‌ మానిటరింగ్‌ అండ్‌ లీగల్‌ వింగ్‌లో ఠాణాలు, డాక్యుమెంటేషన్‌ ట్రైనింగ్‌ అండ్‌ అవేర్‌నెస్‌ వింగ్‌లో డ్రగ్‌ డిస్పోజల్‌ అండ్‌ అవేర్‌నెస్‌ కమిటీలతో పాటు వివిధ రాష్ట్ర, కేంద్ర విభాగాలు, అడ్మిన్‌ అండ్‌ లాజిస్టిక్‌ వింగ్‌లో ట్రాన్స్‌పోర్టు, కంట్రోల్‌ రూమ్‌, టెక్నికల్‌ వింగ్‌లో డేటా ఎనాలసిస్‌, డార్క్‌ వెబ్‌, సోషల్‌ మీడియా మానిటరింగ్‌, డిజిటల్‌ ఫోరెన్సిక్‌, అఫెండర్స్‌ మానిటరింగ్‌ విభాగాలు, స్టేట్‌ టాస్క్‌ఫోర్స్‌లో నార్కోటిక్స్‌ డిటెక్షన్‌ డాగ్స్‌ విభాగం ఏర్పాటు కావాల్సి ఉంది. ఇవి ఎప్పటికి సాకారమవుతాయన్నది ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోతున్నారు.

డిజిటల్‌ వేదికగా ‘కుతుబ్‌ షాహీ టూంబ్స్‌’ పరిరక్షణ

సాక్షి, సిటీబ్యూరో: నగరానికే తలమానికమైన వారసత్వ సంపద ‘కుతుబ్‌ షాహీ సమాధుల’ను డిజిటల్‌ వేదికపై పరిరక్షించడంలో ముందుకు సాగుతున్నామని హెగ్జాగోనల్‌ రియాలిటీ టెక్నాలజీ సీఈఓ పాలో గుగ్లియెల్మిని తెలిపారు. కుతుబ్‌ షాహీ టూంబ్స్‌ డేటా–రిచ్‌ డిజిటల్‌ ట్విన్‌ కోసం హెగ్జాగోనల్‌ ఆధ్వర్యంలో రియాలిటీ టెక్నాలజీ నేపథ్యంలో మంగళవారం కుతుబ్‌ షాహీ సమాధుల వేదికగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐటీ ప్రిన్సిపల్‌ సెక్రటరీ జయేశ్‌ రంజన్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలో గుగ్లియెల్మిని మాట్లాడుతూ.. స్మార్ట్‌ సిటీ టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి, అధునాతన డిజిటల్‌ ఆవిష్కరణలతో చారిత్రాత్మక ల్యాండ్‌మార్క్‌ల సంరక్షణకు మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామన్నారు. నగరంలోని గత చరిత్రకు చెందిన అద్భుత ఆనవాళ్లను రక్షించడానికి రియాలిటీ టెక్నాలజీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్‌–రియాలిటీ వేదిక డేటా– రిచ్‌ యాక్షన్‌ డిజిటల్‌ ట్విన్‌ను అనుసంధానం చేయడానికి అధునాతన ఏఐ పరిష్కారాలను వర్తింపజేశామని హెగ్జాగోనల్‌ ఆర్‌అండ్‌డీ ఇండియా సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ నవనీత్‌ మిశ్రా పేర్కొన్నారు.

కంటి సమస్యలను అరికట్టాలి

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

హుడాకాంప్లెక్స్: పిల్లల కంటి సమస్యల నివారణకు విటమిన్‌–ఏ ఎంతగానో దోహదపడుతుందని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరూర్‌నగర్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విటమిన్‌–ఏ ద్రావణం పంపిణీని ఆయన ప్రారంభించారు. మొదటిరోజు తొమ్మిది నెలల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఈ ఔషధాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లలకు సంభవించే రేచీకటి, ఇతర కంటి జబ్బులను నివారించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో ద్రావణం పంపిణీ ఉంటుందన్నారు. పిల్లలకు తప్పనిసరిగా ఇప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణలత, జిల్లా ఉప వైద్యాధికారి వినోద్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్చన పాల్గొన్నారు.


చిన్నారికి ఔషధం ఇస్తున్న వైద్యులు

అధికారుల ఆలయ పరిశీలన


గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీవో సూరజ్ కుమార్

అడ్డుకున్న మామిడిపల్లి గ్రామస్తులు

పహాడీషరీఫ్: రోడ్డు విస్తరణలో భాగంగా మామిడిపల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని తొలగించే విషయమై పరిశీలించేందుకు వచ్చిన అధికారులను గ్రామ యువకులు అడ్డుకున్నారు. గ్రామంలోని వివేకానంద చౌరస్తా నుంచి సీఐఎస్‌ఎఫ్ క్వార్టర్స్ మీదుగా వేస్తున్న నూతన రహదారి పక్కన ఉన్న ఆలయాన్ని తొలగించాంచాలని జీఎంఆర్ సంస్థ ఫిర్యాదు మేరకు.. మహేశ్వరం ఆర్డీవో సూరజ్ కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డిలు ఆలయం వద్దకు మంగళవారం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ అక్కడికి చేరుకొని పురాతన ఆలయాన్ని కూల్చరాదని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను గుర్తించి ఆలయాన్ని యథావిధిగా ఉంచాలన్నారు. మరోచోట ఆలయం నిర్మించి ఇస్తామని జీఎంఆర్ అధికారులు భక్తులకు వివరించారు. అనంతరం సర్వే నంబర్ 99/1లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూడా అధికారులు పరిశీలించారు. ఆయా నిర్మాణాలను త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

మీర్‌పేట: మహిళ మెడలోని గొలుసు తెంచుకుని పారిపోయిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. గుర్రంగూడ టీచర్స్‌కాలనీకి చెందిన బోయపల్లి సంధ్యారాణి గృహిణి. ఆమె పని నిమిత్తం దేవరకొండకు వెళ్లి సోమవారం రాత్రి 9 గంటలకు ఆర్టీసీ బస్సులో వచ్చి గుర్రంగూడ బస్టాప్‌లో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంది. యాక్టివ వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 3.5 తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైసమ్మ ఆలయంలో చోరీ

బంగారం, నగదు అపహరించిన దుండగులు


వివరాలు తెలుసుకుంటున్న సీఐ

కొత్తూరు: పట్టణంలోని భవానీనగర్ కాలనీలో ఉన్న మందోస్‌బాయి మైసమ్మ ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ధర్మకర్త విశ్వం, స్థానికుల వివరాల మేరకు.. ఉదయం ఆలయ తలుపులు ధ్వంసం చేసి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో పరిశీలించగా దేవతామూర్తులకు అలంకరించేందుకు భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు హుండీలో భక్తులు సమర్పించిన సుమారు రూ.3 వేల నగదును దోచుకెళ్లినట్లు ధర్మకర్త వివరించారు. అనంతరం సీఐ నర్సింహారావు సిబ్బందితో ఆలయాన్ని పరిశీలించి చోరీ జరిగిన తీరును ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి


కేశంపేట: న్యాయయాత్రలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి

కేశంపేట: దేశంలో, రాష్ట్రంలో ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో నిర్దవెల్లి, లేమామిడి, కాకునూర్, సుందరపురం, కేశంపేట గ్రామాల్లో న్యాయయాత్రను మంగళవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీల్లో ప్రభుత్వం రెండింటిని అమలు చేసిందన్నారు. త్వరలోనే మరో రెండు హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే, ఎంపీలు కాంగ్రెస్ పార్టీకే చెందిన వారు ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. చల్లా వంశీచందర్‌రెడ్డిని నియోజకవర్గం దత్తత తీసుకుందని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. సుందరపురం గ్రామంలో నిర్వహించిన న్యాయయాత్రలో మాజీ సర్పంచ్ రాములునాయక్ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్ పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, నాయకులు వీరేష్, శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సుందరయ్య, భాస్కర్‌గౌడ్, యాదయ్యయాదవ్, కరుణాకర్‌రెడ్డి, అమేర్, రూప్లానాయక్, భాస్కర్ నాయక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్నర్ మీటింగ్


షాద్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్ రెడ్డి అన్నారు. న్యాయయాత్ర మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరం, కిషన్‌నగర్, హాజిపల్లి, షాద్‌నగర్‌లో నిర్వహించారు. పట్టణ చౌరస్తాలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టిందని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు. చుక్కనీరు కూడా పంట పొలాలకు పారడం లేదని ఆరోపించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, విశాల, తిరుపతిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, చెన్నయ్య, శివశంకర్‌గౌడ్, బాబర్‌ఖాన్, రఘు, ఇబ్రహీం, కాశీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

బడంగ్‌పేట్: నిర్మాణ రంగంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసినట్లు ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ నితీష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో భారతి స్టీల్ మార్కెటింగ్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని నితీష్‌యాదవ్ తెలిపారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక భారతి సిమెంట్ అన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని తెలిపారు. అనంతరం మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమాతో పాటు పలు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ బద్రి, మేస్త్రీలు పాల్గొన్నారు.


మేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న భారతి సిమెంట్ నిర్వాహకులు

ఉరేసుకొని కార్మికుడి ఆత్మహత్య


మోహన్ సాకేత్ (ఫైల్)

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ జీబీబీఐ బేకర్స్‌లో పనిచేస్తున్న కార్మికుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్సై సక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రేవా జిల్లాకు చెందిన మోహన్ సాకేత్ (20) కొన్నేళ్లుగా లాల్‌పహాడ్ జీబీబీఐ బేకర్ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఓ అమ్మాయితో ప్రేమ విఫలం కావడంతో మనస్థాపానికి గురై సోమవారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు


వికాస్ (ఫైల్)

కొత్తూరు: కొత్తూరు పట్టణంలో ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామానికి చెందిన మనీల ఈ నెల 11న తన కుమారుడు వికాస్(11), కూతురుతో కలిసి యాచించడానికి కొత్తూరు పట్టణానికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆమె అనారోగ్యంగా ఉండడంతో అదే రోజు మధ్యాహ్నం బావర్చి హోటల్ సమీపంలోని వేపచెట్టు కింద పిల్లలతో కలిసి నిద్రించింది. కొద్దిసేపటి తర్వాత లేచి చూడగా వికాస్ కనిపించలేదు. అతడి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి రిమాండ్

మీర్‌పేట: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి నందనవనం లక్కీ హోటల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నందనవనం వాంబే కాలనీకి చెందిన కమ్లే దేవానంద్, మొహమ్మద్ ఖలీల్, కాకం రాజశేఖర్‌లు ఆటోలో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ మేరకు పోలీసులు వారి వద్ద నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంపై వేటు

కొత్తూరు: ఓ చిన్నారి మృతికి కారణమైందంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనలో కొత్తూరు పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఏఎన్‌ఎం మల్లమ్మను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. కొత్తూరు పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్ మంగళవారం మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపల్ పరిధిలోని కుమ్మరిగూడకు చెందిన సురేష్, సునీత దంపతులు గతేడాది నవంబర్‌లో తమ బాబు (రెండున్నర నెలలు)కు వ్యాక్సిన్ వేయించేందుకు తిమ్మాపూర్‌లోని ఆరోగ్య ఉప కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఏఎన్‌ఎం మల్లమ్మ చిన్నారికి టీకా వేసింది. కొద్ది సేపటి తర్వాత బాబు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ చిన్నారి ప్రాణాలు దక్కించుకోలేకపోయారు. తమ బిడ్డ మరణానికి ఏఎన్‌ఎం కారణమని ఆరోపిస్తూ బాధితులు పోలీసులు, వైద్య, ఆరోగ్యశాఖకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అనంతరం తమకు న్యాయం చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఏఎన్‌ఎంను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కోసం ప్రత్యేక కమిటీని నియమించామని, వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థికి స్వర్ణం


బంగారు పతకం సాధించిన వైష్ణవి

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వైష్ణవి రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో అండర్–14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడంలోని తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో వంద మీటర్ల విభాగంలో వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అదే విధంగా 400 మీటర్లలో మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. హెచ్‌ఆర్ ఆర్ వెస్ట్ రీజియన్ ఆర్‌సీవో శారదావెంకటేష్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపక బృందం విద్యార్థికి అభినందనలు తెలిపారు.

చరిత్ర సృష్టించిన రెసోనెన్స్

మాదాపూర్: దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన జేఈఈ పరీక్షలో రెసోనెన్స్ అద్భుత ఫలితాలను సాధించిందని రెసోనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం మాదాపూర్‌లోని రెసోనెన్స్ జూనియర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించి జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ తొలి విడత పరీక్ష ఫలితాల్లో రెసోనెన్స్ జూనియర్ కళాశాలల హైదరాబాద్ విద్యార్థులు చరిత్ర సృష్టించారన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఎన్ఈఈటీ, మెడికల్ ప్రవేశ పరీక్షల్లో అగ్రశ్రేణి ర్యాంకర్లను తయారు చేయడంలో రెసోనెన్స్ జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిందన్నారు.

ప్రేమించి.. పెద్దలను మెప్పించి



శంకర్‌పల్లి: ఇద్దరం ఇష్టపడ్డాం.. పెద్దల అంగీకరించడంతో ప్రేమ వివాహం చేసుకున్నాం. ఒకరిని ఒకరు అర్థం చేసుకున్నాం.. సంతోషంగా జీవిస్తున్నాం. మా ప్రేమకు ప్రతిరూపంగా బాబు ఉన్నాడు. నేను బీసీ కావడంతో శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీచేసి గెలుపొందా. ఆరోజు నుంచి ప్రజల్లో ఉంటూ సేవ చేస్తున్నా. కుటుంబ సభ్యులందరం ఒకే ఇంట్లో సంతోషంగా ఉంటున్నాం. నా భర్త పాండురంగారెడ్డి బీఆర్‌ఎస్ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అందరికీ వాలంటైన్స్ డే శుభాకాంక్షలు. ప్రేమను దక్కించుకోవడం చూపే పట్టుదలను జీవితంలో ఉన్నతంగా బతకాలనే విషయంపై కూడా చూపాలి. అప్పుడే ప్రేమకు విలువ ఇచ్చిన వారవుతాం.

– జూలకంటి శ్వేతపాండురంగారెడ్డి, కౌన్సిలర్, శంకర్‌పల్లి

విడదీసిన విధి

ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు

తలకొండపల్లి: పిల్లాపాపలతో హాయిగా సాగుతున్న జీవితంలో.. ఓ ప్రయాణం ఆ కుటుంబాన్ని అంధకారంలోకి నెట్టింది. భర్తతో కలిసి వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఆమెను బలిగొంది. మండల పరిధిలో మంగళవారం రాత్రి ఈ విషాదం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సీతారాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన నాగుల సుభాష్, సునీతలు భార్యాభర్తలు. వీరు సాయంత్రం బైక్‌పై వెల్జాల్‌కు వెళ్లారు. సంతలో కూరగాయలు తీసుకొని తిరిగి వస్తుండగా మార్గమధ్యలో వెల్జాల్–చంద్రధన శివారులో ఎదురుగా వస్తున్న స్కూటీ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సునీత(39)కి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుభాష్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు కూడా గాయాలు అయ్యాయి. వీరు బీహార్ రాష్ట్రానికి చెందిన రాజేంద్రకుమార్, సూరజ్‌లుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతి చెందిన సునీతకు ముగ్గురు పిల్లలున్నారు.

ఆయన టార్గెట్.. ఎవరెస్ట్!

- రాచకొండ కొత్త సీపీకి పర్వతారోహణ హాబీ
- ఇప్పటికి ఆరు పర్వతాలను అధిరోహించిన తరుణ్ జోషి
- ఎవరెస్ట్ ఎక్కడమే లక్ష్యంగా నిత్యం సాధన
- 'కొత్త బాధ్యతలు' నేడు స్వీకరించే అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్ కొత్త పోలీసు కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఓ పర్వతారోహకుడు. అదిలాబాద్ ఎస్పీగా పని చేస్తున్న సమయంలోనే పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్న ఆయన ఇప్పటి వరకు 6 పర్వతాలను అధిరోహించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యంగా అనునిత్యం సాధన చేస్తున్నారు డాక్టర్. తరుణ్ జోషి బుధవారం రాచకొండ సీపీగా ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

- పంజాబ్‌కు చెందిన తరుణ్ జోషి పటియాలాలోని గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నుంచి బీడీఎస్ పూర్తి చేసి దంత వైద్యుడిగా మారారు. 2004లో సివిల్ సర్వీసెల్ ఉత్తీర్ణులైన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో ఐపీఎస్ అధికారిగా నియమితులయ్యారు.
- ఓ పక్క విధులు నిర్వరిస్తూనే కొత్త అంశాలను నేర్చుకునేందుకు ఆసకిత చూపుతుంటారు. ఉద్యోగంలో తర్వాతే పదేళ్ల క్రితం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పోలీస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఆపై ఎల్‌ఎల్‌బీలో చేరి 2019 జూలైలో ఉత్తీర్ణులు కావడమే కాదు... వర్సిటీ టాపర్‌గా నిలిచారు.
- తరుణ్ జోషి 2014 నుంచి 2016 వరకు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం ఏపీ పోలీసు విభాగంలో ఉన్న ఎస్పీ జి.రాధిక అప్పట్లో అదే జిల్లాలో అదనపు ఎస్పీగా పని చేశారు. పర్వతారోహణపై పట్టున్న ఆమె పలు పర్వతాలను అధిరోహించారు. విధి నిర్వహణలో భాగంగా అనునిత్యం తరుణ్ జోషిని కలిసే ఆమె తన పర్వతారోహణ అనుభవాలను పంచుకునే వారు.
- ఇలా అనుకోకుండా ఆ రంగంపై ఆసక్తి పెంచుకున్న ఆయన తాను పర్వతారోహకుడిని కావాలని భావించారు. సంతృప్తితో పాటు మానసిక, శారీరక దారుఢ్యానికి ఇది ఉపకరిస్తుందనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని రాధికతో చెప్పగా... తొలుత డార్జిలింగ్‌లోని హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకోవాలని, ఆపై తుది నిర్ణయానికి రావాలని ఆమె సూచించారు.
- అదిలాబాద్ ఎస్పీగా పని చేసినన్నాళ్లు పని ఒత్తిడి నేపథ్యంలో డార్జిలింగ్ వెళ్లడం ఆయనకు సాధ్యం కాలేదు. అక్కడ నుంచి రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు తొలి సంయుక్త పోలీసు కమిషనర్‌గా వచ్చిన తరుణ్ తనలో ఉన్న పర్వతారోహణ ఆసక్తికి పదును పెట్టారు.
- 2017లో హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న ఆయన అదే ఏడాది అక్టోబర్‌లో తొలిసారిగా హిమాలయాల్లోనే ఉన్న మౌంట్ రీనాక్‌కు ఎక్కారు. అప్పటి నుంచి అవకాశం దొరికినప్పుడల్లా పర్వతారోహణ చేస్తున్న ఆయన ఇప్పటి వరకు ఆరింటిపై తన కాలు మోపారు. ఎవరెస్ట్‌పై కాలు పెట్టడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

తరుణ్ జోషి అధిరోహించిన పర్వతాలు...

- 2018 మేలో సదరన్ రష్యాలోని భారీ అగ్నిపర్వతమైన మౌంట్ ఎల్బ్రస్‌ను ఎక్కారు. సముద్ర మట్టానికి 5,642 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ శిఖరం యూరప్‌లోనే పెద్దది.
- 2019 జనవరిలో అర్జెంటీనాలో ఉన్న మౌంట్ ఎకనగ్వాపై అడుగుపెట్టారు. మెండొజా ప్రావెన్స్‌లో ఉన్న దీని ఎత్తు 6962 మీటర్లు. దక్షిణ అమెరికాలోనే ఎత్తైనది.